


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

## 4

**“ఏం భాయ్**. నే విన్న వార్త నిజమేనా?” ఉస్మాన్ అడిగాడు.

“ఏ వార్త?”

“మెయిన్ రోడ్‌లో బూట్‌పాలిష్ చేస్తున్నావా? నిజమేనా?”

కార్తీక్ నవ్వాడు. “అదేమీ గొప్ప పని అని అనుకోవడం లేదు. తినడానికి తిండిలేదు. తొందరలో ఉద్యోగం దొరికే అవకాశం లేదు. అందుకని ఈ వృత్తి మొదలుపెట్టాను. అంతేకాని కథలో హీరో అయిపోదామని కాదు. ఆకలి తీరడం ముఖ్యం కదా!”

“కానీ మరీ బూట్‌పాలిష్...”

“చెప్పానుగా. అదేమీ గొప్ప పని అనుకోవడం లేదని! బట్టలు ఉతకడం, జుట్టు కత్తిరించడం లాంటి పనులకి కాస్త ఆర్టూ, పెట్టుబడీ కావాలి. దీనికైతే ఆ రెండూ అవసరం లేదు.”

“నాకెందుకో నచ్చలేదు భాయ్. రెండు ట్యూషన్లు చెప్పుకుని బ్రతకొచ్చుగా”

“ఇప్పించు. వెంటనే ఈ పని మానేస్తాను.”

ఉస్మాన్ మాట్లాడలేదు. కార్తికేయ నవ్వుతూ “చూశావా అదీ కష్టమే. అందుకే ఉద్యోగం దొరికే వరకూ ఈ పని చేయనీ. అన్నట్టు పద, నీకు చిన్న పార్టీ ఇస్తాను” అని లేస్తూ “అందరూ మొదటి నెల జీతం, తొలి సంపాదన రాగానే ఫ్రెండ్స్‌కి పార్టీ ఇస్తారు. మనది రోజువారీ సంపాదన కాబట్టి, మొదటి రోజు జీతంతో నీకు రొట్టె కొనిపెడతాను. సరేనా. పద!” అన్నాడు.

“నువ్వింత ఆనందంగా ఎలా ఉండగలవు? ఈ రహస్యం నాకూ చెప్పు భాయ్” హోటల్లో కూర్చున్నాక అడిగాడు ఉస్మాన్.

కార్తీక్ నవ్వాడు. “‘ప్రతిరోజూ కప్పు బూస్టు త్రాగండి. రోజంతా ఆరోగ్యంగా ఉండండి’ అని ప్రకటనలు ఇస్తారు. ఆవిధంగా నన్ను ఇమ్మంటే ‘డబ్బుపట్ల ఆశ వదులుకోండి. రోజంతా సంతోషంగా ఉండండి’ అంటాను. అయినా అది కూడా నిజం కాదులే. ఎందుకంటే...”

''ఆ! ఎందుకంటే...''

''వద్దులే'' సిగ్గుపడ్డాడు కార్తికేయ.

''అరే. చెప్పు భాయ్''

''ఏదైనా ఖరీదైన బూట్లు పాలిష్ చేస్తూ చేస్తూ నేనూ కలల్లోకి జారిపోతాను. నేను పాలిష్ చేస్తూ ఉండగా రోడ్డుమీద ఒక టయోటా కారు కీచుమన్న బ్రేకుల చప్పుడుతో ఆగుతుంది. అందులోంచి మెరుపు తీగెలాంటి అమ్మాయి దిగి, సంభ్రమంగా దగ్గరకొచ్చి ''మీరు రావ్ బహద్దూర్ గజపతిరావుగారి మనవడు కదూ'' అంటుంది. నా ఎదురుగా ఉన్న బూటుకాలి మనిషి మా ఇద్దరి వైపూ ఆశ్చర్యంగా చూస్తూ ఉంటాడు. నేను మనసులో గర్వపడుతూ పైకి వినయం ముసుగేసి, ఆనందానికి చిరునవ్వు తెర తొడిగి 'అవునండీ' అంటాను. ఆమె కారులో నన్ను ఎక్కించుకుని ఛాయ్ హోటల్‌కి తీసుకువెళుతుంది''.

''టయోటా కారులో చాయ్ హోటల్‌కా?''

''మరి దేనికి?''

''కలలు కనేటప్పుడు అయినా కాస్త మంచి బార్ గురించి ఊహించు భాయ్.''

''మనకు తెలియని విషయాలు ఊహించడం ఎందుకులే ఉస్మాన్. ఇంతకీ నే చెప్పొచ్చేది ఏమిటంటే, ఊహించుకున్నప్పుడు కూడా 'డబ్బు' గురించే ఆలోచిస్తున్నాను చూడు. దీన్నించి ఎలాగైనా బయటపడాలి. కోరిక మీద పట్టు సాధించటం అంటే అదీ...'' అంటూ చేతిలోకి పేపరు తీసుకున్నాడు. వెయిటర్ కేకు ప్లేటు తీసుకొచ్చి ఇద్దరి మధ్యా పెట్టాడు. ఒక చేత్తో కేకు తింటూ, మరో చేత్తో పేపర్ చదువుతున్న కార్తికేయ అప్రయత్నంగా ''ఓహో ఈవిడేనా ఆ అమ్మాయి'' అన్నాడు.

''ఏ అమ్మాయి భాయ్?''

''డాక్టర్ దగ్గర నా ఉద్యోగం పోగొట్టింది ఈ కళ్యాణే అనుకుంటాను''.

''నువ్వేమనుకుంటావో అని ఇంతకాలం అడగలేదు. ఎలా పోయింది నీ ఉద్యోగం?''

''మా డాక్టర్ గారికి వచ్చిన ఫోన్ ఒకటి నేను పొరపాటున విని, పేషెంట్ అనుకుని సలహా ఇచ్చాను. దాంతో ప్రొద్దున్నే ఆవిడ డాక్టర్‌ని బెదిరించింది. ఆయన నా ఉద్యోగం తీసేశాడు.''

''చిన్న ఫోన్ మాట్లాడినందుకే ఉద్యోగం తీసేయిస్తుందా? పద భాయ్. నాలుగు దులిపేసి వద్దాం!''

''ఆవిడ తీసేయించ లేదు ఉస్మాన్. మా డాక్టరే బెదిరి పోయి నన్ను తొలగించాడు.''

''బెదిరించడం మాత్రం సామాన్య విషయమా! బస్తీలో ఈ ఉస్మాన్‌కి ఎంత పలుకుబడి ఉందో నీకు తెలీదు. పదిమంది జనాన్ని వేసుకెళ్దాం పద. పోయిన ఉద్యోగం వచ్చేలా చేస్తాను. ఈ ఉస్మాన్ రక్తానికి రక్తం, ప్రాణానికి ప్రాణం ఇస్తాడు. ఏమనుకుంటోందావిడ? మహారాణి అనుకుంటోందా?''

కార్తికేయ తలెత్తాడు. అతడి కళ్ళు స్వచ్ఛంగా నవ్వుతున్నాయి! విశ్వాన్ని శాసించే వేదాంత భావం స్వరంలో పలుకుతుండగా అతనన్నాడు ''అవతలి మనిషి విసుగుని తన సహనంతో, కోపాన్ని క్షమతో, బలహీనతని ప్రేమతో, తప్పుని నవ్వుతో ఎదుర్కొనే మనిషికి జీవితంలో విషాదం అనేది ఉండదు. 'నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఎలా ఉండగలవు?' అని అడిగావుగా ఉస్మాన్. బహుశా ఇదే కారణం అయివుంటుంది. ఎక్కడైతే అసంతృప్తి ఉన్నదో అక్కడ ఆనందం ఉండదు. అసంతృప్తి అనేది మనిషికి దేనివల్లనైనా రావచ్చును. అది తీరని కామము వల్ల కావచ్చు, తెగని క్రోధమువల్ల కావచ్చు. వాటిని జయిస్తే జీవితమంతా ఇక తృప్తే అనుకుంటాను.''

ఉస్మాన్ ఉద్విగ్నుడై ఏదో చెప్పాలనుకుని చెప్పలేకపోయాడు. కార్తీక్ కుర్చీలోంచి లేచి ''అందువల్ల మనకి కళ్యాణి మీద కోపం వద్దు. పద'' అన్నాడు వాతావరణాన్ని తేలికచేస్తూ. ఇద్దరూ బయటికొచ్చారు. ఇరానీ హోటల్ ఎదురుగా గోడమీద క్రీస్తు సూక్తి పెయింట్ చేయబడి ఉంది. దాని అర్థం ఇలా ఉంది –

''ఇలా ఉండాలని నువ్వు అనుకుంటావు. నిన్నెలా ఉంచాలో దేవుడు నిర్దేశిస్తాడు.''

''కూర్చోండి'' అన్నాడు పీటర్. కార్తికేయ ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు. పీటర్ వయసు నలభై ఐదు ఉంటుంది. 'పింక్ పాంథర్' సినిమాలో పీటర్ సెల్లర్స్‌లా ఉన్నాడు. మాటి మాటికీ జుట్టు సర్దుకుంటున్నాడు. కార్తికేయ తన చేతిలో కాగితం అందించాడు. దాన్ని అందుకుని, ''ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి నుంచి అభ్యర్థుల లిస్టు తీసుకుని మేమే కాల్ లెటర్స్ పంపించాం. వివరాలు చదివి కూడా ఈ ఇంటర్వ్యూకి వచ్చారంటే, మీకు ఉద్యోగం అవసరం ఉన్నదన్నమాట'' అన్నాడు పీటర్.

''అవును సార్. చాలా ఉంది.''

''మా సంస్థ 'స్కైపాక్' ఒక కొరియర్ సర్వీసు. దేశంలో ఎక్కడికైనా, ఏ ప్రదేశానికైనా ఒక్క రోజులో ఉత్తరాలు, ప్యాకెట్లు అందజేయడం మా స్పెషాలిటీ.''

కార్తికేయ వింటున్నాడు.

''హైదరాబాద్ నుంచి 'చిరుగావ్'కి ఒకళ్ళు ఒక వస్తువు పంపుతారు. ఒక్క రోజులో అది అక్కడకు చేరాలి. విమానంలో ఢిల్లీ పంపుతాం. అక్కడినుంచి లక్నో, తరువాత ట్రెయిన్‌లో బందర్ ఘాట్, అక్కణ్ణుంచి బస్‌లో చిరుగావ్. ఇదంతా ఆగమేఘాల మీద జరగాలి. మన కష్టమర్లు డబ్బుకి వెనుకాడరు. ఎంత తొందరగా దాన్ని అందజేయ్యగలమా అని చూస్తారు. చెప్పండి కార్తీక్. ఈ ఉద్యోగం ప్రతిభావంతంగా చెయ్యగలనని మీకు నమ్మకం ఉందా?

''తప్పకుండా చెయ్యగలను సర్!''

''గుడ్. అయితే ఈ రోజే ఉద్యోగంలో చేరిపొండి''. కార్తికేయకి ఆశ్చర్యమేసింది. అంత తొందరగా ఉద్యోగం దొరకడం ఈ రోజుల్లో ఎనిమిదో వింత!!

''ఇక మీ జీతం...'' అన్నాడు పీటర్. ''ప్రస్తుతానికి మీకు మూడు వేలు. ఆర్నెల్ల ప్రొబెషన్ పూర్తవగానే అయిదువేలు వస్తుంది.'' కార్తికేయ సంభ్రమంతో ఊపిరి బిగపట్టాడు. ''మీ దారి ఖర్చులు పోనూ మిగతాదంతా కలుపుకుంటే నెలకు పదివేల దాకా మిగుల్తుంది మిస్టర్ కార్తీక్.''

కార్తికేయ బలంగా ఊపిరి వదిలాడు. ప... ది... వే... లు. అది నిజమేనా? కలా??

''రేపొచ్చి అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకువెళ్ళండి.''

కార్తికేయ లేచి రెండు చేతుల్తో నమస్కారం చేశాడు. అతడి కళ్ళల్లో సన్నటి నీటిపొర కదలాడింది. ''చాలా థాంక్స్ సర్. నా కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఆకలితో ఎడారిలో తిరుగుతున్నవాడికి ఒక్కసారిగా పంచభక్ష్య పరమాన్నాలు దొరికినట్టు ఉంది'' అని అక్కణ్ణుంచి కదిలాడు.

అతడు వెళ్ళగానే, పీటర్ ఫోన్ చేసి ప్రతాపరెడ్డితో ''...మీరు చెప్పినట్టే చేశాను సార్. అతను రేపు వచ్చి అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుంటాడు'' అన్నాడు.

''అతను ఆర్డరు తీసుకోగానే ఆఫీసు ఖాళీ చేసెయ్యండి. మళ్ళీ ఎంక్వయిరీ చేసినా, ఆ ఉద్యోగం ఇచ్చింది ఎవరో అతనికి తెలియకూడదు'' అంటూ  ఫోన్ పెట్టేసి, శ్రీకళ్యాణికి చేశాడు ప్రతాపరెడ్డి. తను సాధించిన విజయం గురించి చెప్పుకోవాలని అతడి మనసు ఉవ్విళ్ళూరుతోంది.

ఆ సమయానికి శ్రీకళ్యాణి సత్యం గురించి ఆలోచిస్తోంది. ఆమె మనసు చికాగ్గా ఉంది. దానిక్కారణం, ఆ రోజు మధ్యాహ్నం ఆమె సత్యాన్ని ఒక 5 నక్షత్రాల హోటల్లో ఒకమ్మాయితోపాటు చూసింది. ఆమెకి అతడు ఒక ఖరీదయిన బహుమతి ఇస్తున్నాడు. దాని పట్ల ఆమెకి ఏమీ అభ్యంతరం లేదు కానీ, అతడి రాబడికి అంత ఖరీదైన హోటల్‌కి రావటం, స్నేహితురాలికి అంత ఖరీదయిన బహుమతి ఇవ్వటం... కళ్యాణికి ఎందుకో అనుమానం కలిగించింది. ఆమె ఆ విసుగులో ఉండగా ప్రతాపరెడ్డి నుంచి ఫోన్ వచ్చింది.

''మీరు చెప్పినట్లే కార్తికేయకి ఉద్యోగం ఇచ్చాం. రేపే వచ్చి జాయిన్ అవుతున్నాడు'' అన్నాడు ప్రతాపరెడ్డి.

''కార్తికేయ ఎవరూ?''

ప్రతాపరెడ్డి గతుక్కుమన్నాడు. ఒక్కసారిగా అతడి ఆనందం మీద నీళ్ళు జల్లినట్టు అయింది. ''నువ్ చెప్పావుగా అమ్మాయ్! ఆ డాక్టర్ దగ్గర అసిస్టెంటు.''

''ఓహో అతనా... అవును... అతనికి తగిన పాఠం చెప్పమన్నాను.''

''అదే... అందులో మొదటి భాగంగా అతడికి ఉద్యోగం ఇచ్చాం.

''ఏం చెయ్యాలో మొత్తం చెప్పాగా. అది చేసి చెప్పండి చాలు. ఎప్పటికప్పుడు నాకు రిపోర్టు చేయనవసరం లేదు'' అని ఫోన్ పెట్టేసింది.

ఆమె అంత గొప్ప పారిశ్రామికవేత్త ఎలా అయిందో అతనికి ఇప్పుడు అర్థమయింది. ఆ కుర్రాడి మీద కక్ష తీర్చుకునే వరకూ ప్రతి నిముషమూ తనకు ఫోన్ చేసి, ఆ విషయం గుర్తు చేసింది. ఒక్కసారి ఆ పని తను తీసుకోగానే, పేరుతో సహా ఆ విషయం పూర్తిగా మర్చిపోయింది. కేవలం చివరి రిజల్టు చెప్పమని ఫోన్ పెట్టేసింది. అనవసరమైన విషయాలు బుర్రలో నింపుకోకుండా, మెదడుని ఫ్రెష్‌గా ఉంచుకోవడం మంచి బిజినెస్‌మెన్ లక్షణం. 'తనకెప్పుడు వస్తుందో అది' అనుకుంటూ ప్రతాపరెడ్డి క్రూరంగా తల గోక్కున్నాడు. అతడికి ఇద్దరు మగవాళ్ళు నలుగురు ఆడపిల్లలు. మొత్తం ఆరుగురికీ పెళ్ళి చేయాలి. పెద్దోడు అమెరికా వెళ్తానంటున్నాడు. రాబోయే రెండు సంవత్సరాల్లో కనీసం పది లక్షల ఖర్చు ఉంది. ఎలా? పేరుకి గొప్పే అయినా, సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీ లాభసాటిగా లేదు. శ్రీకళ్యాణి లాంటి కస్టమర్లు ఒకరిద్దరు ఉండబట్టి ఏదో నడుస్తోంది కానీ, లేకపోతే భారతదేశంలో అలాంటి డిటెక్టివ్ ఏజెన్సీలకు వ్యాపారం ఎక్కడుంది?

ఏదో ఒకటి చేసి పది లక్షలు సంపాదించాలి. ఏం చెయ్యగలడు? అతడు ఆలోచిస్తున్నాడు.

''ఇదిగో నీ అపాయింట్‌మెంట్ ఆర్డరు. ఈ సాయంత్రం మనం బయల్దేరుతున్నాం'' అన్నాడు పీటర్.

''ఎక్కడికి సర్'' కార్తికేయ అడిగాడు.

''రాజస్తాన్''

''రాజస్తానా? ఇంకో మూడు గంటల్లోనా?'' విస్తుపోతూ అన్నాడు కార్తీక్.

''మనకి అంతంత జీతాలు ఇస్తున్నది ఎందుకు? ఏ క్షణం అవసరం వస్తే అప్పుడు బయల్దేరాలి.''

''అబ్బే ఊరికే అడిగాను సార్. నాదేముంది? తాడూ బొంగరం లేనివాడిని. ఎప్పుడంటే అప్పుడే.''

ఆ సాయంత్రం ఇద్దరూ బయల్దేరాక పీటర్ చెప్పాడు. ''జోధ్‌పూర్‌లో కాస్త పని ఉంది. అక్కడనుంచి ఇద్దరం 'జై సల్మీర్' వెళ్తాం! రాజ్‌మాండ్ దగ్గర విడిపోతాం! నువ్వీ కవరు రాణీమహల్‌లో ఇవ్వాలి. నేను ఈ పెట్టె లక్ష్మణ్‌పూర్‌లో ఇచ్చి వస్తాను. ఇద్దరం తిరిగి రాజ్‌మాండ్ దగ్గర కలుసుకుంటాం. అర్థమైందా?''

కార్తికేయ తలూపాడు. అతడికేమీ అర్థం కాలేదు. అంత దూరం వెళ్ళినవాడు, తనే రెండూ ఇచ్చి రావచ్చుగా. ఇంత ఖర్చు దేనికీ... అనుకున్నాడు. అయినా పైకి ఏమీ అనలేదు.

జోధ్‌పూర్ చేరుకునే సరికి రాత్రి పదిన్నర అయింది. వెంటనే జైసల్మీర్ ట్రెయిన్ ఎక్కారు. ఆంధ్రాలోలా ప్రతి అయిదు కిలోమీటర్లకీ ఒక ఊరు ఉండదక్కడ. ఒకసారి ఊరు దాటితే అన్నీ మైదానాలు, ఇసుక పర్రలు... మళ్ళీ ఎప్పటికో ఇంకొక స్టేషన్ వచ్చేది.

ప్రొద్దున్న పదకొండింటికి ట్రెయిన్ జైసల్మీర్ చేరింది. థార్ ఎడారి ప్రారంభంలో ఉంది జైసల్మీర్. అక్కడనుంచి బస్ మీద ఇద్దరూ రాజ్‌మాండ్ వెళ్ళారు. అదో మూడు గంటల ప్రయాణం. అంతా దుమ్ము ధూళి. బస్ బయల్దేరిన అరగంటకి ఎడారి మొదలైంది. ఎటు చూసినా ఇసుక. మధ్యలో చిన్న చిన్న గడ్డి తుప్పలు. మిలటరీ హడావుడి మాత్రం బాగా ఉంది. ఆ ప్రాంతపు కచ్ ఎడారి సరిహద్దుల్నుంచే పాకిస్తానీ టెర్రరిస్టులు ప్రవేశించేది.

రాజ్‌మాండ్ చేరేసరికి మధ్యాహ్నం మూడయింది. ఒకవైపు ఎడారి ఎండ, మరొకవైపు సుదీర్ఘమైన ప్రయాణం చేసిన అలసట. అలవాటు లేకపోవటం వల్ల ఇసుక ముక్కులో దూరి చాలా ఇబ్బంది పెడుతోంది.

''ఇంతింత జీతాలు ఎందుకిస్తారో అర్థమైందిగా'' బస్ దిగుతోంటే అన్నాడు పీటర్. 'ఇందులో పదోవంతు జీతానికి దీనికి పదిరెట్లు కష్టపడేవాళ్ళున్నారు సార్ మన దేశంలో' అందామనుకున్నాడు. అనలేదు.

''ఇక్కడనుంచి నీ కోసం ఒక ఒంటె మాట్లాడతాను. వెళ్ళి ఆ ఉత్తరం ఇచ్చి వచ్చెయ్యి. నీ దగ్గరేమైనా డబ్బులున్నాయా?'' అన్నాడు పీటర్.

''లేవు.''

''ఇదిగో. ఈ ఐదు రూపాయలు ఉంచు. ఒంటె ఖర్చు నువ్వేమీ ఇవ్వనవసరం లేదు. రానూ పోనూ నేనిచ్చేశాను. దాదాపు రెండు గంటల ప్రయాణం. రానూ పోనూ అయిదు గంటలుంటుంది. వచ్చి మళ్ళీ ఇక్కడే నిలబడు. ఇద్దరం వెనక్కి వెళ్ళిపోదాం. నేను లక్ష్మణ్‌పూర్ వెళ్ళాలి. అదిగో నా బస్ రెడీగా ఉంది!''

బస్ హారన్ మ్రోగింది.

''అసలు నేనూ నీతో వద్దామనుకున్నాను. ఒంటె ప్రయాణం అంటే నాకూ సరదాయే. కానీ లక్ష్మణ్‌పూర్‌లో ఈ లక్ష రూపాయలు కాష్ ఇవ్వకపోతే మన కష్టమరు కొంపలంటుకుంటాయి. సరిగ్గా అయిదు గంటల తరువాత ఇక్కడ కలుసుకుందాం. సరేనా.''

బస్ హారన్ చివరిసారి మోగింది. పీటర్ హడావుడిగా పరుగెత్తుకుంటూ వెళ్ళి బస్ ఎక్కాడు. దుమ్ము రేపుకుంటూ బస్ వెళ్ళిపోయింది.

కార్తికేయ దగ్గరకి ఒంటెవాడు వచ్చి ''చెలేంగే సాబ్'' అన్నాడు. 'వెళ్దాం' అన్నట్టు కార్తికేయ తలూపాడు.

పశ్చిమ రాజస్తాన్... బస్ రూట్‌లో చివరి ఊరు! అక్కణ్ణుంచీ అంతా ఇసుకే. ఒంటె మీద దాదాపు రెండు గంటలు ప్రయాణం. 'రాణీమఠ్' అంటే దాదాపు యాభై ఇళ్ళుంటాయి. రాజస్తాన్ రాష్ట్రంలో ఆమాత్రం గడపలుంటే అదే పల్లెటూరు.

కార్తికేయకి ఈ ప్రయాణం అద్భుతంగా ఉంది. కొన్ని మనం ఊహించలేం. నిన్నటి వరకూ నిరుద్యోగి. ఈ రోజు ఇక్కడ ఒంటెమీద..! స్కైపాక్ వ్యాపార ప్రకటన గుర్తొచ్చింది అతడికి..! 'నీళ్ళల్లో ఉన్నా, అగ్నిలో ఉన్నా, చైనా గోడమీద ఉన్నా – ఎక్కడ ఉన్నా మీకు మీ ప్యాకెట్ అందజేస్తాం' అనే కొరియర్ సర్వీస్ అడ్వర్‌టైజ్‌మెంట్ అది.

చుట్టూ సముద్రంలాంటి ఇసుక. దూరంగా అక్కడక్కడ నీటి గుంటలున్నట్టు భ్రాంతి! ఎండమావుల గురించి పుస్తకాల్లో చదువుకున్నాడు. ఇప్పుడు ప్రత్యక్షంగా చూడడం వింతైన అనుభూతి! ఒంటె కదుల్తుంటే శరీరం ఎగిరెగిరి పడుతోంది. ముందు కూర్చున్న మావటి హుషారు చేస్తున్నాడు! ఒంటె పరుగెడుతోంది.

కార్తికేయకి దానిమీద కూర్చోవటం కష్టంగా ఉంది. ఎంతో అనుభవం ఉంటేగాని ఒంటె ప్రయాణం కష్టం. అలా దాదాపు రెండు గంటలు ప్రయాణం చేసి వాళ్ళు రాణీమట్ చేరుకున్నారు. కార్తికేయ కవరు పై అడ్రసు వైపు చూశాడు.

HANDOVER TO HOTEL ASHOKA, RANI MUTT అని ఉంది.

ఒక చిన్న కొట్టు దగ్గర ఆగి, హిందీలో 'హోటల్ అశోకా' ఎక్కడని అడిగాడు. మొత్తం ఊరంతటికీ అదే కొట్టులా ఉంది. ఒకవైపు కూరగాయలు, మరోవైపు టీ బాయిలరు, మూల కిరాణా వస్తువులున్నాయి. (రాజస్తాన్‌లో చాలా నాణ్యమైన టమోటాలు దొరుకుతాయి.)

''ఏమిటీ?'' కొట్టువాడు అర్థంకానట్టు అన్నాడు.

''హోటల్ అశోకా''

పిచ్చివాడిని చూసినట్టు కార్తికేయని చూసి ''హోటల్ ఉండేంత పెద్ద ఊరులా కనబడుతోందా ఇది'' అన్నాడు. కార్తికేయకి ఆ మాట నిజమే అనిపించింది. లంబాడీ గుడిసెల్లాంటివి ఓ పాతిక ఉన్నాయి. ఆ కొట్టువాడు మళ్ళీ అన్నాడు. ''ఇదిగో టీ కొట్టు. అవి కూరగాయలు, ఇంకా కిరాణా. అన్నీ కలిపి మొత్తం నాకెంతొస్తుందో తెలుసా? రోజుకి పది రూపాయలు. ఇక్కడ హోటలా? హ్హాహ్హాహ్హా''

ఇంతలో వెనుక నుంచి ఒంటెవాడు వచ్చి ''సాబ్. నా డబ్బులు'' అన్నాడు.

''ఆయన ఇవ్వలేదా? రానూ పోనూ ఇచ్చేశానన్నాడే'' అన్నాడు కార్తికేయ.

''లేదు సాబ్. ఇదే మా ఊరు. దొర ఇక్కడి వరకే మాట్లాడాడు. డబ్బులు ఏమీ ఇవ్వలేదు.''

కార్తికేయకి షాక్ తగిలినట్టు అయింది. ఏదో అనుమానం వచ్చి ''ఎంత?'' అని అడిగాడు.

''అయిదు రూపాయలు సాబ్.''

రాజస్తాన్‌లో ఒంటె ప్రయాణం చాలా చౌక. కానీ కార్తికేయ ఆ సంగతి ఆలోచించడం లేదు. ఇక్కడ అయిదూ ఇచ్చేసి, జేబులో పైసా లేకుండా వెనక్కి రాజ్‌మాండ్ చేరుకోవడం ఎలా అని ఆలోచిస్తున్నాడు. ఏమి జరిగిందో అర్థం కాలేదు. ఈ తండాలో హోటల్ గురించి ఇక వెతకడం మూర్ఖత్వం. నిస్సహాయంగా చేతిలో కవర్ వైపు చూశాడు. అది అతికించలేదు. తెరిచి ఉండడం చూసి, లోపల్నుంచి కాగితం తీశాడు. అందమైన అక్షరాలు... అందులో ఒకే ఒక వాక్యం–

''***ఆడాళ్ళు అర్ధరాత్రి ఫోన్ చెయ్యగానే ఇంకెప్పుడూ రెచ్చిపోయి మాట్లాడకు***'' అని ఉంది.

సాయంకాలం ఐదున్నరయింది. ఎడారి ప్రాంతాల్లో సాయంత్రం అయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. కనీసం కంబళయినా లేకపోతే రాత్రిపూట అక్కడ ఉండడం దాదాపు అసంభవం. బయల్దేరడం కూడా అసంభవమే. ఎడారిమీద చీకటి తివాచీ పరచుకుంటోంది. కళ్ళు మూసుకున్నాడు.చేతిలో పైసా లేకుండా దేశపు ఈ మూలనుంచి ఆ మూలకి ఎలా వెళ్తాడు? జేబులో పైసా లేకుండా రాణీమఠ్ నుంచి... రాజ్‌మాండ్ – జైసల్మీర్ – జోధ్‌పూర్ – ఢిల్లీ – ఆంధ్రప్రదేశ్. ఒంటె... బస్సు... రైలు...

ఎలా?

కార్తికేయ నిస్త్రాణగా టీ కొట్టు ముందున్న బల్లమీద కూలబడి చేతిలో కాగితం వైపు చూసుకున్నాడు. *ఆడాళ్ళు అర్ధరాత్రి ఫోన్ చెయ్యగానే ఇంకెప్పుడూ రెచ్చిపోయి మాట్లాడక.* ఆ మాటల వెనుక 'నేనెవరో తెలుసుకోలేవు' అన్న అర్థం ఉంది. 'చూశావా ఎంత గ్రాండ్‌గా నీకు పాఠం చెప్పానో...' అన్న గర్వంతో కూడిన చిరునవ్వు ఉంది.

తనకి చిన్న పాఠం చెప్పడం కోసం ఒకరు ఇంత ఖర్చు చేశారంటే అతనికి ఆశ్చర్యంగా ఉంది. 'మోసగింపబడటాన్ని' ఆవిడ ఎంత సీరియస్‌గా తీసుకుందో, మనుష్యులమీద ఆవిడకి ఎంత కోపం ఉందో అతనికి అర్థమైంది. ఆవిడ మానసిక స్థితి పట్ల జాలి కలిగింది.

అతడు ఆలోచనల్లో ఉండగానే చీకటి మరింత దట్టమైంది. ఆకలి మొదలైంది. ''రెండు జతల బట్టలు అమ్మితే అయిదు రూపాయలు రావూ?'' అనుకున్నాడు. అప్పుడు పడింది అతని దృష్టి సూట్‌కేస్ మీద!

ఒక్కసారిగా చైతన్యవంతుడయ్యాడు.

పీటర్ తెచ్చిన సూట్‌కేస్ అది! బస్ హారన్ కొడుతుంటే ఆ హడావుడిలో దాన్ని అక్కడ మర్చిపోయి వెళ్ళి బస్ ఎక్కేశాడు. తన సామాన్లతోపాటు అది వచ్చేసింది.

అతడికి పీటర్ మాటలు గుర్తొచ్చాయి. ***''లక్ష్మణపూర్‌లో మన కస్టమర్‌కి ఈ డబ్బు అందివ్వకపోతే కొంపలంటుకుంటాయి. సాయంత్రంలోగా అందాలి!''***

కార్తికేయ ఆలోచనలో పడ్డాడు. తను మోసగింపబడిన మాటా, కొరియర్ సర్వీస్‌లో తనకి ఉద్యోగం రాని మాటా నిజమే కానీ, తమ గొడవల మధ్య లక్ష్మణ్‌పూర్ కస్టమరు నష్టపోకూడదు కదా.

ఈ ఆలోచన రాగానే మరి ఆలస్యం చేయకుండా కొట్టువాడి వైపు తిరిగి ''నాకు ఏదైనా వాహనం దొరుకుతుందా? అర్జెంటుగా వెళ్ళాలి'' అన్నాడు.

''రాత్రిపూట ఒంటెల మీద ఎవరూ ప్రయాణం చేయరు. దొంగల భయం'' అన్నాడు.

అక్కడ  రాజ్‌మాండ్‌లో తనకోసం పీటర్ ఎదురు చూస్తూ ఉంటాడు. ఉద్యోగ విషయంలో తనని అతడు (ఆమె ఆదేశాలవల్ల) మోసం చేసినా సరే జరిగిన పొరపాటుకి అతడు ఉద్యోగం పోగొట్టుకోకూడదు. ఆ ఆలోచన రాగానే మరి ఆలస్యం చెయ్యకుండా తన సామానులూ, ఆ సూట్‌కేసూ తీసుకుని లేచాడు కార్తికేయ.

సముద్రంలాంటి ఇసుక తిన్నెల మధ్య – కృంగిపోతున్న సూర్యుడివైపు – మళ్ళీ ఒంటరిగా నడిచిపోతున్న ఆ ఆగంతకుడు – అసలు ఎందుకొచ్చాడో — కనీసం 'టీ' కూడా తాగకుండా ఎందుకు వెళ్ళిపోతున్నాడో అర్థంకాక కొట్టువాడు ఆశ్చర్యంగా చూశాడు.

## 5

**కళ్యాణికి** జీవితంలో అంత కోపం ఎప్పుడూ రాలేదు. ప్రతాపరెడ్డి తలవంచుకుని కూర్చుని ఉన్నాడు. అతడి వెనుక చేతులు నలుపుకుంటూ పీటర్ నిలబడి ఉన్నాడు. అసలు జరిగిన విషయం ఏమిటంటే, శ్రీకళ్యాణికి జోథ్‌పూర్ నుంచి ఒక మిషన్ రావాల్సి ఉంది. దానికి బిల్‌తో నిమిత్తం లేకుండా బ్లాక్‌లో లక్ష రూపాయలు పంపాలి. సెక్యూరిటీ సర్వీస్‌లో ఎవరైనా నమ్మకస్తుల ద్వారా దీన్ని పంపమని ప్రతాపరెడ్డిని కోరింది. ఈపనికి అతడు పీటర్‌ని వినియోగించాడు.

కార్తికేయని కూడా పంపించి ఎడారి మధ్యలో వదిలెయ్యొచ్చన్న ఆలోచన కూడా ఆమెదే. అక్కడ్నుంచీ నాటకం మొదలైంది. కార్తికేయకి ఉద్యోగం ఇచ్చినట్టు నటించి పీటర్ తనతోపాటు తీసుకెళ్లాడు. కార్తికేయ జేబులో పైసా లేకుండా చేసి అతడిని రాణీమర్ పంపాడు.

అయితే పీటర్ ఆ హడావుడిలో జోథ్‌పూర్ తీసుకెళ్ళాల్సిన సూట్‌కేస్‌ని కార్తికేయ దగ్గర మర్చిపోయాడు..!

''చెప్పిన పని ఇంత ఛండాలంగా పాడుచేసింది నా క్రింది ఉద్యోగే అయితే వెంటనే డిస్మిస్ చేద్దును'' నిప్పులుకక్కే స్వరంతో కళ్యాణి అరిచింది. ప్రతాపరెడ్డి జవాబు చెప్పలేదు.

''మీ సిగ్మా ఏజెన్సీ గురించి గొప్పగా కబుర్లు చెప్పారు. మీ దగ్గర చాకు లాంటి ఏజంట్లు ఉన్నారన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క జేమ్స్‌బాండ్ అన్నారు. కానీ మీ సీక్రెట్ ఏజెంట్లు – బస్‌టైమ్ అయిపోతుందని సూట్‌కేసులు వదిలి పరిగెత్తే బఫూన్లని ఇప్పుడే తెలిసింది''.

తన తల ఎంత సైజులో వాచిందో చూసుకుంటున్నాడు పీటర్. ప్రతాపరెడ్డి ధీమాగా ''నువ్వేం కంగారుపడకమ్మా. ఆ కార్తీక్ రాగానే అతడినుంచి లక్ష రూపాయలు కక్కించే బాధ్యత నాది'' అన్నాడు.

చేతిలో పేపరు నేలకి విసిరికొట్టి, ''వెధవ లక్ష రూపాయలు. నేను బాధపడుతున్నది అందుక్కాదు. నేనెంత ఫూల్ అయ్యానో తల్చుకుంటేనే సిగ్గుతో తల కొట్టేసినట్టు ఉంది. ఉత్తరం వ్రాసి మరీ గొప్పగా కవరులో పెట్టాను. అది చదువుకొని అక్కడ అతను ఎంత నవ్వుకుని ఉంటాడో!'' అని ఆగి, తనలో తనే అనుకున్నట్టుగా... ''కొంపతీసి మనమెవరో తెలిసే ప్రమాదం ఉందా?'' అంది.

పీటర్ చప్పున ''లేదు మాడమ్. ఆ సూట్‌కేస్‌లో డబ్బు తప్ప మరేమీ లేదు'' అన్నాడు. 'ఏడవలేకపోయార'న్నట్టు చూసి, ''జీవితాంతం గుర్తు పెట్టుకునే సంఘటనలా చెయ్యాలనుకున్నాను. జీవితాంతం సిగ్గొచ్చే సంఘటనగా మారింది'' అంది.

అతడి మీద అంత పగ ఉన్న అమ్మాయికి సాయం చెయ్యాలనుకున్న పీటర్, ''డబ్బు పోయిందని పోలీసు రిపోర్టు ఇచ్చి అతడిని అరెస్ట్ చేయిస్తే?'' అని సలహా ఇచ్చాడు.

''విల్ యు ప్లీజ్ కీప్ యువర్ మౌత్ షట్ (దయచేసి మీరు నోరు మూస్తారా?)'' అంది చిరాగ్గా. అతడు తన రహస్య సెక్స్ దృశ్య వీక్షణ సంగతి విని సలహా ఇచ్చాడు. దానికి ప్రతీకారంగా దేశపు మారుమూల ఎడారి నడిమధ్యలో అతడిని వదిలిపెట్టాలని అనుకుంది. ఆమె ఈగో మీద అతడు దెబ్బకొట్టాడు. తన తెలివితేటలు ఎలాటివో అతడికి చూపించాలనుకుంది. అతడిని జైల్లో పెట్టించి నాశనం చేయటం కాదు ఆమెకి కావాల్సింది. అయితే ఇప్పుడు కథ అడ్డం తిరగడంతో ఆమె ఈగో మరింత దెబ్బతిన్నట్టయింది. ఆమె చిరాకుకు అదీ కారణం.

ఢిల్లీ ఫోన్ చేసి తన కంపెనీ మనిషిని అర్జెంటుగా జోథ్‌పూర్ వెళ్ళి లక్ష రూపాయలు ఇమ్మని చెప్పింది. ప్రతాపరెడ్డి వైపు తిరిగి ''మీ ఆఫీసులో ఏదైనా ఇలాంటి పొరపాటు జరిగి, మీకు లక్ష రూపాయలు నష్టం రావడమే కాకుండా, మీరనుకున్న పని కాకపోతే ఆ వ్యక్తిమీద ఎలాంటి చర్య తీసుకుంటారు?'' అని అడిగింది.

''అతడిని ఉద్యోగంలోంచి తీసేస్తాం.''

''ఇంకా?''

''అతడి వల్ల నష్టపోయిన లక్ష రూపాయలు ఎలా రాబట్టుకోవాలా అని ఆలోచిస్తాం.'

''ఆ కార్తికేయ మనకి దొరక్క ఒకవేళ ఆ డబ్బు రాబట్టుకోలేకపోతే?''

ప్రతాపరెడ్డి ఏదో మాట్లాడబోతుంటే తలుపు దగ్గర చప్పుడైంది. ముగ్గురూ అటు చూశారు.

బయట నుంచి పడుతున్న ఎండలో, ఒక సిలౌట్‌లా నిలబడి ఉన్నాడు అతడు. అతడి బట్టలు దుమ్ముకొట్టుకుని ఉన్నాయి. తైల సంస్కారం లేనట్టు జుట్టు రేగిపోయి ఉంది. అతడిని చూసి పీటర్ గుండె ఆగినట్టు అనిపించింది.

ఒక నమ్మలేని చిత్రం చూస్తున్నవాడిలా... ఒక హిప్నాటిస్ట్ సూచనల మేరకు కల నుంచి బయటపడిన వాడిలా... పీటర్ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. అయితే ఆ వచ్చినదెవరో శ్రీకళ్యాణికి తెలియదు. అందుకని అధికార స్వరంతో, ''ఏం కావాలి?'' అని అడిగింది.

అతడు ఆమెవైపు చూడటం లేదు. పీటర్ వైపు చూస్తున్నాడు. ఇప్పటి వరకూ ఏ మాత్రమైనా కాస్త అనుమానం మిగిలి ఉంటే అదీ తీరిపోయినట్టు, తను సరైన ఇంటికే వచ్చినట్టు అతడి మొహంలో రిలీఫ్ కనబడుతున్నది.

''ఏం కావాలి? నిన్నెవరు లోపలికి రానిచ్చారు? అడుగుతోంటే జవాబు చెప్పవేం?'' అని ఆమె గద్దించింది. వెనుక నుంచి పీటర్ కల్పించుకుని ''అ... అతనే... త... నే... కార్తికేయ...'' అన్నాడు తడబడే స్వరంతో.

అంతే. ఆ గదిలో సూది పడితే వినపడేంత నిశ్శబ్దం వ్యాపించింది. శ్రీకళ్యాణికి అతడిని చూస్తూంటే కలిగిన మొట్టమొదటి ఫీలింగ్ – *ఇతడితోనే ఆ రాత్రి తను సెక్స్ గురించి మాట్లాడింది..!* రెండో ఫీలింగ్ – *ఇతడినే తను ఎడారి మధ్యలో వదిలిపెట్టి రమ్మంది..!*

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments